భారత్-ఈయూ... వ్యూహాత్మక సంబంధాలు!!

ఐరోపా దేశాలూ, భారత్.. రెండూ ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాయి. రెండింటిలోనూ కొన్ని ఉమ్మడి విలువలు కనిపిస్తాయి. రెండు దేశాల్లోనూ స్వతంత్ర, క్రియాశీల మీడియా ఉంది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జోస్ మాన్యుయల్ బొర్రోసా ప్రకారం... భారతదేశం-యూరోపియన్ యూనియన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇవే కారణాలు..!

భారత్, ఈయూ రెండూ సమన్యాయం, మానవహక్కుల పరిరక్షణకు పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాయి. రెండు చోట్లా భిన్న మతాలు, కులాలు, సామాజిక వర్గాలు ఉన్నప్పటికీ... భిన్నత్వంలో ఏకత్వం ఉంది. రెండూ కూడా పరమత సహనానికి అధిక ప్రాధాన్యత ఇస్తాయి. బహుళత్వం పటిష్టంగా అమలయ్యేలా చూసేందుకు.. భౌగోళిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు..భారత్, ఈయూ సహజ భాగస్వామ్య దేశాలుగా మారుతున్నాయన్నది బొర్రోసా అభిప్రాయం. ఇండో–ఈయూ సంబంధాల్లో... ఆర్థిక, వాణిజ్య అంశాలు అత్యంత కీలకమైనవి. భారత్, ఐరోపా దేశాలు రెండింటిలోనూ ఆర్థిక వృద్ధి గణనీయ స్థాయిలోనే ఉంది. అయితే, రెండింటి మధ్య వాణిజ్య లావాదేవీలు, పెట్టుబడులు ఉండాల్సిన స్థాయిలో లేవు. ఇరు పక్షాల మధ్య వాణిజ్యం పెంపొందించడం.. పెట్టుబడుల ఫలాలు పొందడం.. అన్నిరంగాల్లో నానాటికీ పెరిగిపోతున్న పోటీ కారణంగా ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా.. భారత్, ఈయూ దేశాలు తమ మధ్య సహకారం మెరుగుపరచుకోవడం ఎంతో అవసరం. కీలక ప్రాంతీయ శక్తులు.. యూరోపియన్ యూనియన్, భారత దేశం.. రెండూ కూడా కీలకమైన ప్రాంతీయ శక్తులు. ప్రస్తుతం ఈయూలో 27 దేశాలున్నాయి. ఇది ఇంకా విస్తరించే అవకాశ ముంది. అంతేకాకుండా ఇది ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరత, సౌభాగ్యాల కోసం పాటుపడాలని నిర్దేశించుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్.. దక్షిణాసియా సుస్థిరత విషయంలో కీలక పాత్ర పోషిస్తోంది. మరోవైపు ప్రాంతీయశక్తులుగా మారిన ఈయూ, భారత్.. అంతర్జాతీయ స్థాయిలో ముఖ్యభూమిక పోషించే దిశగా ఎదుగుతున్నాయి.

ఈయూతో భారత్‌కు ప్రయోజనం?

ఈయూ.. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని.. దేశానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ – ఎఫ్‌డీఐ) అధికంగా వచ్చేది కూడా అక్కడి నుంచేనని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ తెలిపారు. అయితే, ఈయూ మొత్తం విదేశీ వాణిజ్యంలో.. భారతదేశం వాటా 1.5 శాతం మాత్రమే కావడం గమనార్హం. అంటే... రెండు పక్షాల మధ్య విదేశీ వాణిజ్య విస్తరణకు అవకాశాలు పుష్కలం. దాంతోపాటు భారత్ తనకు అవసరమైన టెక్నాలజీని కూడా అక్కడి నుంచి తెచ్చుకునే వీలుంది. ఐరోపా దేశాల్లో ప్రవాస భారతీయుల సంఖ్య కూడా ఎక్కువే. ఈయూతో భారత్ సంబంధాలు అత్యంత సహజసిద్ధమైనవని మన్మోహన్ సింగ్ అభిప్రాయపడ్డారు. భారత్, ఈయూ దేశాల ఉమ్మడి విలువలైన

ప్రజాస్వామ్యం, సమన్యాయం, మీడియా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయ వ్యవస్థ అందుకు ప్రాతిపదికలన్నారు. సహకారం, ఆర్థిక ప్రగతి నుంచి... విస్తృత అంశాలైన ప్రపంచీకరణ, ఉగ్రవాదం, ఇంధనం, పర్యావరణం వరకూ.. రెండింటి మధ్య సంబంధాలు ఏళ్లుగా అభివృద్ధి చెందుతూ వచ్చాయన్నారు. ప్రపంచ రాజకీయాలు ఏక ధ్రువ వ్యవస్థ నుంచి బహుళ ధ్రువ వ్యవస్థకు మారాల్సిన అవసరమున్న నేపథ్యంలో.. ఈయూతో భారత్ సంబంధాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇండో-ఈయూ వార్షిక సదస్సు:

భారత్-ఈయూ ఎనిమిదో వార్షిక సదస్సు 2007, నవంబరులో ఢిల్లీలో జరిగింది. ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ, వాణిజ్య మంత్రి కమల్‌నాథ్, జాతీయ భద్రతా సలహాదారు ఎం.కె.నారాయణ్... భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడైన పోర్చుగీస్ ప్రధాని జోస్‌సోక్రాట్స్; యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జోస్ మాన్యుయల్ బొర్రోసా, యూరోపియన్ వాణిజ్య కమిషనర్ పీటర్ మాండల్సన్, పోర్చుగీసు విదేశాంగ మంత్రి జావో గోమ్స్ క్రావిన్హో యూరోపియన్ యూనియన్ ప్రతినిధులుగా హాజరయ్యారు. ఇండో-ఈయూ వాణిజ్య, పెట్టుబడుల ఒప్పందం దిశగా చర్చలు జరుగుతున్నాయని... వచ్చే సదస్సు నాటికల్లా అది వాస్తవ రూపం దాల్చవచ్చని మన్మోహన్ సింగ్ వెల్లడించారు. ఈ ఒప్పందం గరిష్ట లక్ష్యాలతో, విస్తృత స్థాయిలో ఉంటుందని ఈయూ కౌన్సిల్ అధ్యక్షుడు జోస్ సోక్రాట్స్ తెలిపారు. భారతదేశ వ్యూహాత్మక ఒప్పందం 2007-2010పై ఇండియా, ఈయూ సంతకాలు చేశాయి. భారత మిలీనియమ్ లక్ష్యాల సాధనలో.. ఇండో-ఈయూ సంయుక్త కార్యాచరణకు.. ఇది దోహదపడుతుంది. దీని మొత్తం బడ్జెట్ 26 కోట్ల యూరోలు.

సంయుక్త ప్రకటన:

సదస్సు ముగింపు సందర్భంగా.. భారత్, ఈయూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్-డబ్ల్యూటీవో) దోహా రౌండ్ చర్చలు విజయవంతమయ్యేట్లు చూడాలని ఆ ప్రకటనలో అభిప్రాయ పడ్డాయి. ఇది తమకు అత్యంత ప్రధానాంశమని ఇరు పక్షాలు ఉద్ఘాటించాయి. వాతావరణ మార్పులపై 2007లో బాలీలో జరిగిన యూఎన్ సదస్సు ఎంతో ముఖ్యమైందని ఈయూ, భారత్ ప్రకటించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు కార్బన్ కారకాల విడుదలను నియంత్రించాల్సిన అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. పాకిస్థాన్‌లో.. త్వరలోనే శాంతి, సుస్థిరత నెలకొంటాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్, అఫ్గాని స్థాన్‌లలో పరిస్థితిపైనా సదస్సులో చర్చ జరిగింది. సంయుక్త ప్రకటనలో పశ్చిమాసియాలో శాంతి, అణ్వస్త్రవ్యాప్తి నిరోధం, ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు, వాణిజ్యం తదితర

అంశాలనూ ప్రస్తావించారు.

సదస్సు ప్రాధాన్యం:

ఉమ్మడి విలువలైన ప్రజాస్వామ్యం.. బహుళత్వం.. మానవహక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ఇండో-ఈయూ ఎనిమిదో సదస్సు పునరుద్ఘాటించింది. అంతేకాకుండా 2008 చివరి నాటికల్లా... 'ఇండో-ఈయూ ఉమ్మడి వాణిజ్య, పెట్టుబడుల ఒప్పందం'పై సంతకాలు జరిగేలా చూడాలని నిర్ణయించాయి. మేధో సంపత్తి హక్కులు, నిర్వహణా విధానాలు, ప్రజాభిప్రాయం తదితర అంశాలపై స్పష్టత అవసరమని ఈయూ కోరుతోంది. అదే సమయంలో... ఈయూ నుంచి భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) పెరిగేలా చూడాలని భారత్ ఆశిస్తోంది!!